94931 70689 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015 Postal Regd No: GTR/84/2016-18




# రాజధాని వార్తలు

Voice of Voiceless




అమరావతి సంపుటి : 3 సంచిక 23, పేజీలు 4 వేల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక ఫిబ్రవరి సోమవారం 26- ఆదివారం 4 మార్చి, 2018

# కియాతో ప్రయోజనాలెన్నో : చంద్రబాబు

● 10 వేల మందికి ఉద్యోగాల కల్పనే లక్ష్యం
● ఏపీలో యూనిట్‌కు శంకుస్థాపన ఆనందంగా ఉంది
● రాష్ట్ర ప్రభుత్వ సహకారం మరవలేనిది : పార్క్



**అనంతపురం :** కియా ప్లాంట్‌తో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కియా మోటార్స్ కోసం హంద్రీనీవా ద్వారా నీటి సరఫరా చేయనున్నట్లు చెప్పారు. అనంతపురం జిల్లాలో పర్యటించిన ఆయన పెనుకొండ సమీపంలోని ఎర్రమంచి దగ్గర కియా కార్ల పరిశ్రమ ఇన్‌స్టలేషన్‌ను చంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా కియా కంపెనీకి భూములు ఇచ్చిన రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. వాహన తయారీ రంగంలో కొరియా తర్వాత మనది రెండో అతిపెద్ద దేశమని, ప్రపంచంలోని అన్ని ప్లాంట్ల కంటే...అనంతపురం ప్లాంటే అధిక ఉత్పత్తి చేస్తుందని సీఎం అభిప్రాయపడ్డారు. చెన్నై-కృష్ణపట్నం కారిడార్ అందుబాటులో ఉందని, ఏడాదికి 10 లక్షల కార్లు ఉత్పత్తి చేస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీని ఆటోమొబైల్ హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. కియా రాకతో అనంతపురం రూపురేఖలు మారిపోనున్నాయని, కియా మోటార్స్‌కు అన్నిరకాలుగా సహకరిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు.

## రాష్ట్రానికి రూ. 13వేల కోట్ల పెట్టుబడులు

కియా మోటార్స్ వల్ల రాష్ట్రానికి రూ. 13వేల కోట్ల పెట్టుబడులు వస్తాయని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గురువారం అనంతపురం జిల్లాలో పర్యటిస్తున్న ఆయన పెనుకొండ సమీపంలోని ఎర్రమంచి దగ్గర కియా కార్ల పరిశ్రమ ఇన్‌స్టలేషన్‌ను చంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదికి 35 లక్షల కార్లు ఉత్పత్తి చేసే పెద్ద సంస్థ కియా అని కొనియాడారు. ఈ పరిశ్రమతో 4 వేల మందికి పర్మినెంట్ ఉద్యోగాలు వస్తాయని , పరోక్షంగా 7వేల మందికి ఉపాధి లభిస్తుందని చంద్రబాబు చెప్పారు. కాంగ్రెస్ హయాంలో దెయ్యాలకు ఫించన్లు ఇచ్చారని చంద్రబాబు ఎద్దేవా చేశారు.

2021 నాటికి 21 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టాలని, పది వేల మందికి ఉద్యోగాలు కల్పించాలన్నదే తమ లక్ష్యమని కియా మోటార్స్ సంస్థ అధ్యక్షుడు పార్క్ అన్నారు. అనంతపురం జిల్లా పెనుకొండ మండలంలోని ఎర్రమంచి వద్ద భారీ విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్న కియా మోటార్స్ ఫ్రేమ్ ఇన్ స్టలేషన్ విభాగం ఈరోజు ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కియో మోటార్స్ సోదర సంస్థ హుందాయ్ ప్లాంట్ ను 1996లో చెన్నైలో ఏర్పాటు చేశామని, ఇప్పుడు, ఏపీలో ఈ సంస్థ యూనిట్ కు శంకుస్థాపన చేయడం తనకు ఆనందంగా ఉందని చెప్పారు. 'కియా' మోటార్స్ ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వ సహకారం మరవలేనిదని, ప్రజలు, అధికారులు చక్కగా సహకరిస్తున్నారని కితాబిచ్చిన పార్క్, తమ సంస్థ ద్వారా సామాజిక కార్యక్రమాలు కూడా చేపడతామని అన్నారు. ఏపీలో మౌలిక సదుపాయాలకు కొరత లేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కియా అధ్యక్షుడు పార్క్, స్థానిక టీడీపీ నేతలు, రైతులు హాజరయ్యారు.

## జగన్ కేసులో ప్రధాని మోడీకి నోటీసులు



- మిగతా 2 లో

లోపలి పేజీల్లో...
మోడీ హయాంలో 'స్వచ్ఛ బ్యాంకింగ్' 4 లో
తెలివి +తలపొగరు= ఆర్జీవీ 4 లో



ఏపీ రాష్ట్ర రాజధాని రాయపూడిలో వేగవంతంగా జరుగుతున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, (క్రింద) ఐ.ఏ.ఎస్ అధికారుల భవన నిర్మాణ పనులు

# శరవేగంగా పారిశ్రామికాభివృద్ధి

● వెల్లువెత్తుతున్న పెట్టుబడులు
● లక్షల్లో ఉపాధి అవకాశాలు
● 14 రోజుల్లో పారిశ్రామిక అనుమతులు

రాష్ట్రంలో శరవేగంగా పారిశ్రామిక అభివృద్ధి జరుగుతోంది. ఈనెల 24నుంచి 26 వరకు మూడు రోజులపాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'అంతర్జాతీయ భాగస్వామ్య సదస్సు 2018'ను నిర్వహిస్తోంది. ప్రభుత్వ విధానాలు తగినంత భూమి, నీరు అందుబాటులో ఉండటం అంతర్జాతీయ స్థాయిలో మౌలిక సదుపాయాల కల్పన సింగిల్ విండో ద్వారా పారిశ్రామిక టౌన్ షిప్స్ ఏర్పాటు కేవలం 14 రోజుల్లో అనుమతులు వంటి సౌకర్యాలు కల్పించడంతో పారిశ్రామిక వేత్తలు ఇక్కడ పెట్టుబడులు ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పారిశ్రామిక ప్రగతికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, విదేశాలలో పర్యటిస్తూ, వివిధ పారిశ్రామిక సదస్సుల్లో పాల్గొంటూ రాష్ట్రంలో ఉన్న అవకాశాలను వివరిస్తున్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాలు ఆయా ప్రాంతాల్లో లభించే వనరుల ప్రాతిపధికన పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తోంది. అన్ని జిల్లాలలో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేస్తున్నారు. మహిళా సాధికారిత సాధించే క్రమంలో మహిళా పారిశ్రామికవేత్తలను ఆకర్షించేందుకు ఐటీ రంగంలో, ప్రత్యేక ఆర్థిక మండళ్లు(సెజ్), ఐటీ పార్కులు వంటి వాటిలో పలు రాయితీలు ప్రకటించింది. రైల్వే, జాతీయ రహదారులు, విమానాశ్రయాలు, రియల్ ఎస్టేట్, తయారీ రంగం, పారిశ్రామిక మండళ్లు ఏర్పాటు చేసే నేపథ్యంలో మౌలిక వసతుల అభివృద్ధికి భారత ప్రభుత్వ నిబంధనలకు లోబడి చైనా సివిల్ ఇంజినీరింగ్ కార్పొరేషన్‌తో మరికొన్ని విదేశీ సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. రాష్ట్రాన్ని పారిశ్రామిక హబ్‌గా రూపొందించే క్రమంలో ప్రభుత్వం అనుసరించే విధానాలు, సమకూర్చే మౌలిక సదుపాయా వల్ల 'ఈజ్‌ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో దేశంలో రాష్ట్రం నెంబర్ స్థానం పొందింది.

పెట్టుబడులకు ప్రపంచంలో అత్యుత్తమ గమ్యస్థానంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక, ఐటీ, ఎలక్ట్రానిక్, సైబర్ వంటి విధానాలను ప్రకటించింది. 2022 నాటికి దేశంలో అభివృద్ధి చెందిన మొదటి మూడు రాష్ట్రాలలో ఒకటిగా, 2029 నాటికి అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా, 2050 నాటికి ప్రపంచంలోనే అత్యుత్తమైన రాష్ట్రాలలో ఒకటిగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వం దృఢ సంకల్పం. ప్రపంచ స్థాయిలో పోటీపడగలిగిన ఉత్తమమైన ఆర్థిక సమాజంగా ఎదగడానికి రాబోయే 15 సంవత్సరాలలో సుస్థిరమైన రెండంకెల వృద్ధి పధకాన్ని ప్రభుత్వం ఎంచుకుంది. ఇందుకోసం సమర్థ పాలనను వేగవంతం చేసే ఏడు మిషన్లు, (ప్రాధమిక రంగం, సామాజిక సాధికారిత, పరిజ్ఞాన నైపుణ్యాభివృద్ధి, పట్టణాభివృద్ధి, పారిశ్రమలు, మౌలికసదుపాయాలు, సేవల రంగం), ఐదు గ్రిడ్లు (గ్యాస్, వాటర్, ఫైబర్, రోడ్, పవర్) మరో ఐదు (నీరు-చెట్టు, బడి పిలుస్తోంది, పొలం పిలుస్తోంది, పేదరికంపై గెలుపు, పరిశుభ్ర-ప్రజారోగ్యం) ప్రచార కార్యక్రమాలు ప్రారంభించి బహుముఖ వ్యూహంతో ప్రభుత్వం ముందుకు వెళుతోంది.

## 14 రోజుల్లో అనుమతులు


ఒక పరిశ్రమ స్థాపించడానికి అక్కడ ఉత్పత్తి అయ్యే వస్తువు, వాడే ముడిపదార్థం, ప్రమాదకర వ్యర్థాల తీవ్రత తదితర అంశాల ఆధారంగా 20 నుంచి 30 రకాల అనుమతులు పొందాలి. పరిశ్రమల శాఖ మొదలు కొని కాలుష్యం నియంత్రణ, విద్యుత్, పౌరసరఫరాలు, అటవీ, భూగర్భజలాలు, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక, మునిసిపాలిటీ, పంచాయతీ రాజ్, వాణిజ్య పన్నులు, రెవెన్యూ, జలవనరులు, కార్మిక, బాయిలర్, సీఏటీ, సీఎస్టీ తదితర అనుమతుల పొందాలి. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం సింగిల్ డెస్క్ విధానం ప్రవేశ పెట్టింది. ఈ విధానం ద్వారా కావలసిన అన్ని పత్రాలు సక్రమంగా ఉంటే 14 రోజుల (పనిదినాలు) లోనే అనుమతులు మంజూరు చేస్తున్నారు.




## విజయవంతంగా భాగస్వామ్య సదస్సులు

పారిశ్రామిక ప్రగతిలో భాగంగా భారత ప్రభుత్వ పరిశ్రమల విధానం, ప్రమోషన్ శాఖ, భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ)తో కలిసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంతర్జాతీయ భాగస్వామ్య సదస్సులు నిర్వహిస్తోంది. ఫిన్ టెక్(ఫైనాన్షియల్ టెక్నాలజీ) సిటీగా అభివ ృద్ధి చెందుతోన్న విశాఖపట్నం నగరంలో 2016, 2017లలో జరిగిన భాగస్వామ్య సదస్సులు విజయవంతమయ్యాయి. ఆ రెండు సదస్సులలో వివిధ రంగాలలో రూ. 11,10,195 కోట్ల పెట్టుబడితో 22 లక్షల మందికి ఉపాధి కల్పించే 876 ప్రాజెక్టులకు సంబంధించి అవగాహనా ఒప్పందాలు జరిగాయి. వాటిలో 48.17 శాతం ప్రాజెక్టులు, 37.09 శాతం పెట్టుబడులతో ఉత్పత్తులు ప్రారంభించాయి. మిగిలినవి వివిధ దశలలో ఉన్నాయి. సదస్సులతో సంబంధంలేకుండా 11,28,340 మందికి ఉపాధి లభించే రూ. 3,15,713 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేసే ప్రాజెక్టులకు సంబంధించి 941 ఒప్పందాలు జరిగాయి. వాటిలో 53 శాతం ప్రాజెక్టులు 38 శాతం పెట్టుబడులతో ఉత్పత్తులు ప్రారంభించాయి. మొత్తంగా చూస్తే రాష్ట్రంలో 33,28,580 మందికి ఉపాధి లభించే విధంగా రూ. 14,25,908 కోట్లతో 1817 ప్రాజెక్టుల ఏర్పాటుకు సంబంధించి ఒప్పందాలు జరిగాయి. వాటిలో ఇప్పటికే 57.9 శాతం ప్రాజెక్టులు 39.16 శాతం పెట్టుబడులతో ఉత్పత్తులను ప్రారంభించాయి. ఒక్క పారిశ్రామిక రంగాన్నే తీసుకుంటే రూ. 4,12,606 కోట్ల పెట్టుబడులతో 10,27,341 మందికి ఉద్యోగులు కల్పించే 408 ప్రాజెక్టులకు స్థాపనకు అవగాహనా ఒప్పందాలు జరిగాయి.

ఈ సదస్సుకు 14 దేశాలకు చెందిన వాణిజ్య మంత్రులను, 39 దేశాల ప్రతినిధులను, అంతర్జాతీ యంగా ప్రముఖ కంపెనీలకు చెందిన ప్రతినిధులతో కలుపుకొని మొత్తం 2,500 మంది హాజరవుతారు. ఈ సదస్సు ప్రారంభోత్సవానికి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ముఖ్యఅతిదిగా హాజరవుతారు. ముఖేష్ అంబానీ, గౌతం ఆదానీ, ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు పలువురు కేంద్ర మంత్రులు, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి ఎన్.అమరనాధ రెడ్డి, ఇతర మంత్రులు పాల్గొంటారు. ఈ సదస్సులో తెలుగు సంస్కృతిని ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తారు.



శిరందాసు నాగార్జున,
డెవలప్ మెంట్ జర్నలిస్ట్
- 9440222914






# రాజధాని వార్తలు

కలం

## పై చేయి సాధించడం కోసం పాట్లు

రాష్ట్రంలో రాజకీయాలు క్షణం క్షణం మారిపోతున్నాయి. ఎత్తుకు పై ఎత్తు వేస్తూ అధికార ,ప్రతిపక్షాలు ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నాయి. మేమేంటే మేము ప్రత్యేక హోదా కోసం కృషి చేస్తున్నామని ప్రజల చెవుల్లో గూడుకట్టుకొని మరీ వినిపిస్తున్నాయి. ఇదంతా ఎన్నికల స్టంటని ప్రజలకు తెలియంది కాదు. ఈనేపథ్యంలో మిత్రపార్టీలు శత్రుపార్టీలుగా మారుతున్నాయి. ఏడాదిలో అసెంబ్లీ ఎన్నికల దరిమిలా పక్కరాష్ట్రాల్లో కొత్తపార్టీలు పుట్టుకొస్తున్నాయి. నాలుగేళ్ల క్రితం పుట్టుకొచ్చిన జనసేన ప్లీనరీని మార్చి 14న నిర్వహించి, పదవులు కట్టబెట్టి పార్టీని బలోపేతం చేస్తామని పార్టీ అధినేత, నటుడు పవన్‌కల్యాణ్ చెబుతున్నారు. ఉద్యోగులకు, నిరుద్యోగులకు, ప్రజలకు అధికారపార్టీ వరాలు కురిపిస్తుండగా, వైసీపీ అధినేత ప్రజాసంకల్పయాత్ర చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు బడ్జెట్ కేటాయింపులపై సర్వత్రా నిరసనలు రావడం వామపక్షాలు ఫిబ్రవరి 8న రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చారు. అసంతృప్తిలో ఉన్న అన్ని సంస్థలు స్వచ్ఛందంగా బంద్‌లోపాల్గొని విజయవంతం చేయడంతో ప్రజాగ్రహాన్ని గుర్తించిన రాజకీయ పార్టీలు తప్పనిసరి పరిస్థితుల్లో పార్లమెంటులో ప్లకార్డులు చేబట్టి నిరసన తెలియచేశారు. అయితే వారంతా మోడీ రావడంతోనే పక్కకు తప్పుకోవడం మాధ్యమాలు కళ్లకు కట్టాయి. రాష్ట్ర భవిష్యత్‌కోసం అన్నిపార్టీలు సమైఖ్యంగా పోరాటం చేయాలన్న వివిధ సంఘాల పిలుపుమేరకు మార్చి 5 నుంచి హోదా కోసం పోరాడుతోందని టీడీపీ, కాంగ్రెస్‌లు కూడా సహకరించాలని జగన్ కోరారు. రాష్ట్రానికి ఎటువంటి హామీలు రాకపోతే ఏప్రిల్ 6న (బడ్జెట్ చివరిరోజు)రాజీనామాలు చేస్తామని కూడా వైసీపీ ప్రజల ముందుకొచ్చింది. రాజీనామాలు కాదు మార్చి 5నే అవిశ్వాసం పెట్టాలని, కావాలంటే తీర్మానానికి అవసరమైన 50 మంది మద్దతు తాను కూడబెడతానని జనసేన అధ్యక్షుడు పవన్ సవాలు విసిరారు. దీనికి ప్రతిస్పందనగా మార్చి 21 తాము అవిశ్వాస తీర్మానం పెట్టనున్నామని జగన్ వెల్లడించారు. ఇలా సవాల్ ,ప్రతిసవాళ్లతో రాష్ట్రం ఎన్నిక వేడిని ఏడాది ముందే కనబరుస్తున్నప్పటికీ దీనిలో బోలెడు లొసుగులు కనిపిస్తున్నాయి. పవన్ తాను ప్రచారం చేసిన తెలుగుదేశం ప్రభుత్వాన్ని ఎంతగా వెనకేసుకు రావాలో అంతగా వెనకేసుకొస్తున్నారు.జగన్ దమ్ముధైర్యం ఉన్నవారంటారు. టీడీపీ పార్టీ ఎంపీలను మాత్రం అవిశ్వాసం పెట్టమని ఒత్తిడి చేయరు. అయితే ఒకరిపై ఒకరు ఆధిపత్యం చెలాయించడానికి, మొత్తం మేమే చేశామని ప్రజల ముందు బోర విరుచుకుంటానికి ఇది పనికొస్తుంది కాని నిజాయితీ మాత్రం అంతంత మాత్రంగానే అనిపిస్తోంది.


ఒకటి మాత్రం నిజం రాష్ట్ర ప్రజలు రాజకీయపార్టీలతో విసిగిపోయాయి. కొత్తపార్టీకోసం కొత్తతరం కోసం ఎదురు చూస్తున్నారు. అయితే అధికారపార్టీపై ప్రజలకున్న వ్యతిరేకతను లెక్కచేయకుండా జనసేన నాయకుడు అధికార పక్షంతో అంట గాకటం తనగోతిని తానే తవ్వుకున్నట్లవుతుందని ఆయన అభిమానులు వాపోతున్నారు. మొదటి నుంచి స్వతంత్రంగా వ్యవహరించకుండా ఎన్నికలనాటికి సొంతపార్టీ పెట్టినా ఓట్లను చీల్చడం కోసమే పార్టీని ఏర్పాటు చేశారని వైసీపీ నిందలు వేస్తుందన్న విషయం పవన్ గుర్తించాలంటున్నారు. చిరంజీవి గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది. ఆమధ్య తమ్ముడు కొడుకు వరుణ్‌తేజ్ నటించిన 'తొలిప్రేమ' సినిమా గురించి, వారి కుటుంబానికి ఆయన ఎంత పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చింది తెగపొగిడేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, ప్రజల కష్టాలు ఏవీ ఆయనకు పట్టకపోవడం ఎంత బాధాకరం .. ఇప్పటికీ ఆయన రాజ్యసభ సభ్యుడే అయినా ఏనాడు వెళ్లి రాష్ట్ర సమస్యలపై దృష్టిపెట్టిందిలేదు. ఎంపీగా అలవెన్స్‌లు, ఇతరత్రా సౌకర్యాలను బాగానే క్లెయిమ్ చేసుకుంటున్నారు. తమ్ముడు అలా... అన్న ఇలా .. వ్యక్తిగత లాభాల కోసం అర్రులు చాచేవారేగాని ప్రజలను పట్టించుకున్నది లేదు. ఆంధ్రదేశాన్ని ఆ భగవంతుడే కాపాడాలి.

**నంది అవార్డుల కోసం**
**రచ్చ చేసినోళ్ళు**
**...................................**
**రాష్ట్రం కోసం**
**నోరు మెదపరేం ?**

వీళ్ళకి నా రాష్ట్రం ఇచ్చే అవార్డులు కావాలి.
కానీ రాష్ట్రం ఏమైపోయినా ఫర్వాలేదు


## శివాలయం కాదు.. సమాధే

**పురావస్తు శాఖ స్పష్టీకరణ**



**ఆగ్రా:** ప్రపంచ సుందర కట్టడం– తాజ్ మహల్ – మొఘల్ చక్రవర్తి షాజహాన్, ఆయన భార్య ముంతాజ్‌ల సమాధే తప్ప శివాలయం కాదని పురావస్తు శాఖ (ఏఎస్ ఐ) తేల్చిచెప్పింది. ఈ మేరకు ఆగ్రా కోర్టులో ఓ అఫిడవిట్ దాఖలు చేసింది. ముంతాజ్ స్మృతి చిహ్నంగా షాజహాన్ ఈ ప్రేమమందిరాన్ని నిర్మించాడని ఏఎస్ ఐ తరఫు న్యాయవాది అంజనీ శర్మ అఫిడవిట్‌లో తెలిపారు. అది సమాధి కాదని, 'తేజోమహాలయ్' పేరుతో ఉన్న శివాలయమని చేస్తున్న వాదనలు ఊహాజనితమని పేర్కొన్నారు. తాజ్ దేశ సంస్కృతీ చిహ్నమని, ఒక ఘన చరిత్రకు సాక్షి అని, దీన్ని పేరు మార్చడం వారసత్వ సాంస్కృతిక చరిత్రను కాలరాయడమే అవుతుందని ఏఎసఐ పేర్కొంది.

## 1న గుంటూరులో రాష్ట్రస్థాయి సదస్సు




**రాజధాని ప్రతినిధి, అమరావతి :** ఏపీకి ప్రత్యేక హోదాతోపాటు విభజన హామిలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా వరుస కార్యక్రమాలను నిర్వహించాలని ఏపీ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి నిర్ణయించింది. సమితి ఆధ్వర్యంలో అదివారం ఐవీ ప్యాలెస్ విజయవాడలో జరిగిన రౌండ్‌టుబుల్ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలతోపాటు ప్రజాసంఘాల నేతల హాజరైపలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఢిల్లీల్లో మార్చి 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాల్లో ప్రత్యేక హోదా, విభజన చట్టంలో హామీల అమలుపై చర్చ జరిగే విధంగా కేంద్రంపై వత్తిడి తీసుకువచ్చేందుకు కార్యాచరణ రూపొందించారు. మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు పార్లమెంటులో పెట్టే అవిశ్వాస తీర్మానానికి మద్దతునివ్వాలని కోరుతూ రాష్ట్రానికి చెందిన ఎంపీలను కలసి లేఖలను ఇవ్వాలని నిర్ణయించారు. ఇప్పటికే కాంగ్రెస్, వైసీపీ కొన్ని కార్యక్రమాలకు పిలుపునివ్వగా వాటికి సమితి తరపున సంపూర్ణ మద్దతు తెలియచేయడమే కాకుండా ఉమ్మడి కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. ఈ వివరాలను సమితి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు చలసాని శ్రీనివాస్, కె రామకృష్ణ విలేకరులకు వివరించారు.

**ఉమ్మడి కార్యక్రమాలు**

- మార్చి 1వ తేదీన గుంటూరులో ప్రత్యేక హోదా, విభజన హామీలపై రాష్ట్రస్థాయి సదస్సు
- మార్చి 2నుంచి 4 వరకూ జిల్లా, మండల కేంద్రాల్లో జరిగే దీక్షల్లో అందర్నీ భాగస్వాములు చేయడం
- మార్చి 5 నుంచి ఢిల్లీలో పార్లమెంటు ఎదుట నిరసన కార్యక్రమాలు
- ఫిబ్రవరి 19 నుంచి మార్చి 1వ తేదీలోపు జిల్లా కేంద్రాల్లో రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించడం.
- ఫిబ్రవరి 21న విజయవాడలో ఉద్యమ గీతాల ఆవిష్కరణ
- మార్చి 1వ తేదీలోపు విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో కళాశాలలు, విశ్వ విద్యాలయాల్లోని విద్యార్థులతో ప్రత్యేక హోదా,విభజన హామీల అమలు అంశాలపై సదస్సుల నిర్వహణ.
- ముందే ప్రకటించిన అన్ని పక్షాల కార్యక్రమాలకు మద్దతు
- రాష్ట్రంలె కాంగ్రెస్, వైసీపీ సహా వివిధ సంస్థలు, సంఘాలు ప్రత్యేకహోదా విభజన హాయీల సమస్యలపై ఆందోళనలు ధర్నాలు, కార్యక్రమాలకు సమావేశం సంఘీభావంతోపాటు మద్దతు ప్రకటించింది.
- ఫిబ్రవరి 28న ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో బెంగళూరులో అవగాహన సదస్సు
- మార్చి 4న ఉత్తరాంధ్ర చర్యావేదిక ఆధ్దర్యంలో విశాఖపట్నం బీచ్‌లో కొవ్వుత్తుల ర్యాలీ
- మార్చి 5 నుంచి 10 వరకూ ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో ఢిల్లీలో ' పార్లమెంటు ముట్టడి'
- మార్చి 5న వైసీపీ ఆధ్వర్యంలో ఢిల్లీలో ధర్నా మార్చి 6,7 తేదీల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలో దీక్షలు
- మార్చి 8న కాంగ్రెస్ ఆధ్వర్యంలో ' ఛలో పార్లమెంట్'
- మార్చి 17న వీసీకే పార్టీ అధ్వన్యంలో ఛలో అమలాపురం
- ఏప్రిల్ 20న రాజమండ్రిలో బహిరంగసభ

## నీరవ్ మోడీ లేఖపై పీఎన్‌బీ ఆగ్రహం




**న్యూఢిల్లీ :** తనను సర్వనాశనం చేశారంటూ పంజాబ్ నేషనల్ బ్యాంకుకు నీరవ్ మోదీ రాసిన లేఖపై, బ్యాంకు ఆగ్రహం వ్యక్తంచేసింది. తన కంపెనీలకు జారీచేసిన లెటర్స్ ఆఫ్ అండర్ టేకింగ్ అక్రమమైనవని, ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్ ఉల్లంఘనకు పాల్పడుతున్నాయని, అందుకే ఫిర్యాదు చేయాల్సి వచ్చిందని గట్టి చురకలే అందించింది. ఈ నేపథ్యంలోనే స్కాంను బయటికి వెల్లడించామని పేర్కొంది. నీరవ్ పొందిన మొత్తం రుణ ప్రక్రియ 'మనీ లాండరింగ్' కిందకి వస్తుందంటూ పీఎన్‌బీ స్పష్టంచేసింది.''మీరు ఎల్ఓయూలను అక్రమంగా పొందారు. కొందరు బ్యాంకు అధికారుల ద్వారా అనధికారిక మార్గంలో వీటిని ఉపయోగించుకున్నారు. ఇలాంటి వాటిని బ్యాంకు ఉపేక్షించదు. ఈ అక్రమ కార్యకలాపాలు ఎఫ్ఈఎంఏ, మనీ లాండరింగ్ ఉల్లంఘనల కిందకి వస్తాయి" అని నీరవ్ మోదీ లేఖకు స్పందిస్తూ పీఎన్‌బీ జనరల్ మేనేజర్ అశ్విని వాట్స్ తిరిగి లేఖ రాశారు.


ఈ కార్యకలాపాలను లా అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల దృష్టికితీసుకురావాలని బ్యాంకు నిర్ణయించిందని తెలిపారు. బ్యాంకు యాజమాన్యం అత్యుత్సాహంతో వ్యవహరించి, తన దారులన్నింటినీ మూసి వేసిందని ఆరోపిస్తూ బ్యాంకు యాజమాన్యానికి నీరవ్ మోదీ ఒక లేఖ రాసిన సంగతి తెలిసిందే. తన బ్రాండును దెబ్బతీసిందని ఆరోపించారు. పీఎన్‌బీ తనపై అన్నీ తప్పుడు ఆరోపణలు చేసిందనీ, ఇప్పటికైనా ఫైర్‌స్టార్ గ్రూపునకు చెందిన విలువైన ఆస్తులను విక్రయించి, బకాయిలు తీర్చే అవకాశం ఇవ్వాలని కోరాడు. ఈ లేఖపై పీఎన్‌బీ ఈ విధంగా స్పందించింది.

**విజయవాడ విద్యార్థుల**

## గ్యాంగ్‌వార్

**రాజధాని ప్రతినిధి, విజయవాడ:** పెనమలూరులో విద్యార్థుల గ్యాంగ్ వార్ జరిగింది. కర్రలు, రాళ్ళతో పరస్పర దాడులు చేసుకున్నారు. ఈ వార్‌లో ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటనను చిత్రీకరిస్తున్న మీడియాపై విద్యార్థులు కర్రలతో దాడి చేసి కెమెరాలను ధ్వంసం చేశారు. పెనమలూరు పోలీస్‌స్టేషన్ ఎదురుగానే ఈ బీభత్స కాండ జరిగింది. విద్యార్థులు రాళ్ళు రువ్వుతుండటంతో స్టేషన్ నుంచి పోలీసులు బయటకు రాలేక పోయారు. స్థానికులు భయంతో తలుపులు వేసుకున్నారు. ఓ ప్రైవేట్ హాస్టల్‌కు చెందిన విద్యార్థుల మధ్య విభేదాలే దాడికి కారణంగా పోలీసులు భావిస్తున్నారు. పూర్తి వివరాలు అందవలసి ఉంది.


## ఐవైఆర్‌కు ఉద్వాసన



**రావాప్రతినిధి, అమరావతి :** ఏపీ అర్చకులు, ఉద్యోగుల సంక్షేమ సంస్థ ఛైర్మన్, మాజీ చీఫ్ సెక్రటరీ ఐవైఆర్ కృష్ణారావుపై ఏపీ ప్రభుత్వం వేటు వేసింది. ఆ పదవి నుంచి ఐవైఆర్ ను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవలి కాలంలో ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఆయన వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.

బ్రాహ్మణులను ముఖ్యమంత్రి పట్టించుకోవడం లేదంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు... ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారాయి. ఈ నేపథ్యంలో, ఆయనకు ఉద్వాసన పలికారు. ఇప్పటికే ఆయనను బ్రాహ్మణ కార్పొరేషన్ పదవి నుంచి తొలగించిన సంగతి తెలిసిందే.

## జనసేన టీషర్టుల పంపిణి




**రాజధాని ప్రతినిధి, అమరావతి :** ఏపీ యూనివర్సిటీల్లో విద్యార్థులకు టీషర్టులు పంపిణీ చేయాలని జనసేన నిర్ణయించింది. టీ షర్ట్‌పై ప్రత్యేక హోదా– ఆంధ్రుల హక్కు అనే నినాదాన్ని ముద్రించారు. జనసేన అధినేత సూచనలతో హోదా పోరాటాన్ని ఎలా ముందుకు తీసుకెళ్లాలనే అంశంపై జనసేన విద్యార్థి విభాగం విధివిధానాలను రూపొందించింది. ప్రత్యేక హోదాపై యువతను ఉత్తేజపరిచేందుకు జనసేన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. దీంతో యువత ఎక్కువగా వినియోగించే సోషల్ మీడియా వేదికపై హోదా పై డిజిటల్ ఉద్యమానికి జనసేన శ్రీకారం చుట్టింది. భగత్ సింగ్ స్టూడెంట్స్ యూనియన్ పేరుతో విద్యార్థి విభాగాన్ని ఏర్పాటు చేసింది.

## జగన్ కేసులో ప్రధాని మోడీకి నోటీసులు

మొదటి పేజీ తరువాయి

**హైదరాబాద్:** జగన్ అక్రమాస్తుల కేసు ఇప్పుడు భారత్‌ను అంతర్జాతీయ న్యాయస్థానానికి ఈడ్చింది. ఇందూ టెక్ జోన్ ఐటీ సెజ్ కేసుతో తాము భారీగా నష్టపోయామని, న్యాయం చేయాలని కోరుతూ మారిషస్ ప్రభుత్వం నెదర్లాండ్స్‌లోని ఆర్బిట్రేషన్ కోర్టును ఆశ్రయించింది. ప్రధాని మోడీ సహా పలువురు మంత్రులకు నోటీసులు పంపించింది. ఇందూ టెక్ జోన్ ఐటీ సెజ్ కేసులో జగన్, శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి సహా పలువురిపై సీబీఐ చార్జిషీట్‌లు దాఖలు చేసింది. దీంతో ఈ ప్రాజెక్టు ఆగిపోయింది. ఇందూ టెక్ జోన్‌లో మారిషస్‌కు 49 శాతం వాటా ఉంది. ఐటీ సెజ్ కోసం మారిషస్‌కు చెందిన కరీసా ఇన్వెస్ట్‌మెంట్స్ మొత్తం రూ. 115 కోట్లు పెట్టుబడి పెట్టింది. ఓ సారి రూ. 1.18కోట్లు, రెండో సారి రూ. 14కోట్లు, మూడో సారి రూ. 99కోట్ల పెట్టుబడులు పెట్టింది.

అయితే సీబీఐ కేసుతో ఈ ప్రాజెక్టు ముందుకు కదల్లేదు. దీంతో తమకు భారీగా నష్టం వాటిల్లిందని 50 మిలియన్ డాలర్ల పరిహారాన్ని ఇప్పించాలని మారిషస్ ప్రభుత్వం నెదర్లాండ్స్‌లోని అంతర్జాతీయ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. మోదీకి నోటీసులు పంపడమే కాకుండా కేంద్ర ఆర్థిక, వాణిజ్య, న్యాయ, పట్టణాభివృద్ధి శాఖల మంత్రులను ప్రతివాదులుగా చేర్చింది. మారిషస్ నోటీసులు పంపిన అంశాన్ని తెలంగాణ ప్రభుత్వం ధ ృవీకరించింది. సీబీఐ, ఈడీ కేసులు పెండింగ్‌లో ఉన్నందున తమ పెట్టుబడుల ఒప్పందానికి రక్షణ లేకుండా పోయిందంటూ మారిషస్ ప్రభుత్వం నోటీసులు పంపించినట్టు తెలంగాణ ప్రభుత్వ అధికారులు వివరించారు.

## విజయసాయిపై కేసునమోదు చేయండి : రాయపాటి



**రాజధాని ప్రతినిధి, అమరావతి :** వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎంపీ విజయసాయిరెడ్డిలపై కేసు నమోదు చేయాలని టీడీపీ ఎంపీ రాయపాటి సాంబశివరావు డీజీపీకి లేఖ రాశారు. అధికారులపై విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసిన వైసీపీ ఎంపీపై కేసు నమోదు చేయాలని లేఖలో ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న ఐఏఎస్, ఐపీఎస్‌లను కించపరిచేలా విజయసాయిరెడ్డి మాట్లాడారన్నారు. గతంలో కూడా ఐఏఎస్, ఐపీఎస్‌లను జగన్ బెదిరించారని రాయపాటి లేఖలో వివరించారు. చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోనందున జగన్, విజయసాయిరెడ్డి ఇద్దరిపై కేసు నమోదు చేయాలన్నారు.శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించిన జగన్, విజయసాయిలపై ఐపీసీ సెక్షన్ 504, 505 1 (బీ), బెదిరింపులకు పాల్పడినందుకు 506 (2), 124 (ఎ), 307 ఆర్‌డబ్ల్యూ, 511తో పాటు ఉద్రిక్తలు రెచ్చగొట్టడం.. ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేసి పరువు నష్టం కలిగించినందుకు ఐపీసీ సెక్షన్ 500 కింద కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని రాయపాటి లేఖ ద్వారా డీజీపీకి విజ్ఞప్తి చేశారు. అయితే ఈ వ్యవహారంలో డీజీపీ ఎలా ముందుకెళ్తారో వేచి చూడాల్సిందే




## సైకిల్ యాత్ర

ప్రత్యేక హోదా ఐదు అక్షరాల పదం కాదు 5 కోట్లు ఆంధ్రుల ఆత్మ గౌరవ నినాదం. హోదా కోసం తిరుపతి నుంచి ఢిల్లీకి సైకిల్ యాత్ర చేస్తున్న వెంకట్ రాజధాని ప్రాంతానికి చేరిన సమయంలో మంచి నీరు అందిస్తున్న రాయపూడి వాసి.

## 28 నుంచి ఇంటర్ పరీక్షలు

- సీసీ కెమెరాల నీడలో ఎగ్జామ్స్ నిర్వహణ
- ఇంటర్ బోర్డు కార్యదర్శి బి.ఉదయలక్ష్మి

**రాజధాని ప్రతినిధి, అమరావతి :** ఈ నెల 28 నుంచి మార్చి 19 వరకు ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని చెప్పారు. పరీక్షలపై బోర్డు కార్యదర్శి బి.ఉదయలక్ష్మి ఈ నెల 23న అన్ని జిల్లాల ఆర్ఐవోలు, ఇతర అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. థియరీ పరీక్షలను పరీక్షలను రాష్ట్రవ్యాప్తంగా 1423 కేంద్రాల్లో నిర్వహించనున్నారు. 28న ఫస్టియర్, మార్చి 1న సెకండియర్ పరీక్షలు ప్రారంభమవుతాయి. గతేడాది రెగ్యులర్, వొకేషనల్ విద్యార్థులు 10.31 లక్షల మంది హాజరుకాగా ఈ ఏడాది ఈ సంఖ్య స్వల్పంగా పెరగనుంది. గతేడాది 124 కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించగా ఈసారి కూడా అంతే సంఖ్యలో ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. అన్ని జిల్లాల్లో కలెక్టర్లు చైర్మన్లుగా హైపవర్ కమిటీలను, కాపీయింగ్‌కు తావు లేకుండా పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. హాల్‌టిక్కెట్లను ఈ నెల 26 నుంచి డౌన్‌లోడ్ చేసుకొవచ్చు. హాల్‌టిక్కెట్లపై ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లతో విద్యార్థులు సంతకాలు చేయించు కోవారు. వాటిపై తమ పేరు, మాధ్యమం, సబ్జెక్ట్, తదితర వివరాలు సరిగా ఉన్నాయో లేదో సరిచూసుకోవాలి. తప్పులుంటే సంబంధిత ప్రిన్సిపాళ్ల ద్వారా సరిచేయించుకోవాలి. ప్రిన్సిపాళ్ల సంతకంతో కూడిన హాల్‌టిక్కెట్లను మాత్రమే పరీక్ష హాల్లోకి అనుమతించనున్నారు. సెల్‌ఫోన్లు, కాలిక్యులేటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించరు.

## అంబేద్కర్ వర్సిటీ దరఖాస్తులకు తుది గడువు 28

**గుంటూరు :** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ ప్రవేశం కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 28వ తేదీ తుది గడువని గుంటూరు ప్రాంతీయ అధ్యయన కేంద్ర సమన్వయకర్త పి.గోపీచంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి విద్యార్హత లేకపోయినా 2018, జులై 1 నాటికి 18 ఏళ్ల నిండిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మార్చి 11న ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని చెప్పారు. వివరాలకు 0963–2227950, 73829 29605 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## రాష్ట్రంలో 200 నిరాశ్రయుల కేంద్రాలు

**తెనాలి :** రాష్ట్రంలో 200 పట్టణ నిరాశ్రయుల కేంద్రాలను ఏర్పాటు చేయడం లక్ష్యమని మున్సిపల్ అడ్మిస్ట్రేషన్ (మెప్మా) అసిస్టెంట్ డైరెక్టర్ కె. వెంకటేశ్వరరావు చెప్పారు. ఆయన తెనాలిలో కేంద్రాలను పరిశీలించారు. 50 వేల జనాభా పైన ఉన్న పట్టణాలలో నూతన కేంద్రాల నిర్మాణానికి రూ. 30 లక్షలు, పాత భవనాల పునర్నిర్మాణానికి రూ. 5 లక్షలు, సామగ్రికి రూ. 2 లక్షలు, వాటి నిర్వహణకు రూ. 6 లక్షల చొప్పున ఇస్తున్నామని వెల్లడించారు. తెనాలిలో తాత్కాలికంగా నడుపుతోన్న కేంద్రానికి ఓఅండ్‌ఎం మంజూరుకు సంబంధించి పరిశీలన జరిపామన్నారు. వలస వచ్చిన వారు కూడా రాత్రుళ్లు వీటిలో ఉండి పగలు పనులు చేసుకోవచ్చన్నారు. రాష్ట్రంలో 50 కేంద్రాలు నడుస్తున్నాయని, మార్చి నెలాఖరుకు మరో 15 కేంద్రాలు అందుబాటులోకి వస్తాయన్నారు. 30 కేంద్రాలు వివిధ దశలలో ఉన్నాయన్నారు. దాతలు ముందుకొచ్చి నడుపుతున్నారన్నారు. నిరాశ్రయుల్ని గుర్తించి తీసుకురావడంలో టాస్క్‌ఫోర్సు కమిటీలు కీలకమన్నారు. ఒక్కో కేంద్రంలో 50 మంది ఉండడానికి వసతులు ఉన్నాయన్నారు.

**విగ్రహంఏర్పాటుకు రూ. 35. వేల కోట్లు**

## రాజధానికి రూ. 1500 కోట్లా?

గురజాల : బీజేపీ ప్రభుత్వం విగ్రహాల ఏర్పాటుకు రూ. 35 వేల కోట్లు ఇచ్చి, రాజధాని నిర్మాణానికి మాత్రం కేవలం రూ. 4 వేల కోట్లు ఇవ్వడం ఎంతవరకు సబబని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు ప్రశ్నించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి రూ. 3500 కోట్లు, ఛత్రపతి శివాజీ విగ్రహానికి రూ. 2,500 కోట్లు, గుజరాత్ రాజధానికి రూ. 6,500 కోట్లు కేటాయించారని, కానీ రాజధాని నిర్మాణానికి కేవలం రూ. 1,500 కోట్లు ఎలా సరిపోతాయో ఆయన ప్రశ్నించారు.

# చనిపోయేందుకు అనుమతించండి

## షానవి

ఒక జీవి భూమిపై పడినప్పటి నుంచి చనిపోయేవరకు ఆహారం కావాలి. దానికోసం నిరంతరం శ్రమపడాల్సిందే ప్రతిప్రాణికి అదొక నిరంతర ప్రక్రియ. వాటి బలాబలాలను బట్టి ఆహార సంపాదనలో తేడాలు ఉంటాయి. అదిసృష్టి ధర్మం అయితే మనిషి మాత్రం కులం, మతం, ప్రాంతం, ఇంకా లింగవివక్షలతో పొట్టగొట్టడం మహానేరం.. హిజ్రా అయినందున తన శక్తిసామార్థ్యాలను అవమానిస్తున్నారని కాబట్టి తాను చనిపోవడానికి అనుమతి నివ్వాలని తమిళనాడుకు చెందిన షానవి రాసిన లేఖ మానవతా వాదులను ఉలిక్కిపడేలా చేసింది. వివరాల్లోకెళితే ...

'తనకు చనిపోవాలని ఉంది కాబట్టి అనుమతించాలంటూ' షానవి రాసిన లేఖ జాతీయ స్థాయిలో సంచలనం సృష్టిస్తోంది. ఇంతకీ షానవికి వచ్చిన కష్టమేంటి? అంటే, అన్నీ ఉద్యోగాలకు సెలక్టవుతున్నా చివరకు రెజెక్టు చేస్తున్నారట. ఉద్యోగానికి ఎంపికైన తర్వాత కూడా ఎందుకు మళ్ళీ షానవి రెజెక్టవుతోంది. అంటే, షానవి ఓ హిజ్రా కాబట్టి. కేవలం తానొక హిజ్రా అన్న కారణంతోనే అందరూ రెజెక్ట్ చేస్తున్నారంటూ షానవి వాపోతోంది. ఇంతకీ విషయం ఏమిటంటే, తమిళనాడుకు చెందిన షానవి ఇంజనీరింగ్ చదివింది. ఎయిర్ ఇండియాలో ఉద్యాగానికి దరఖాస్తు పెట్టుకుంది. అన్నీ పరీక్షల్లోనూ పాసైంది. చివరకు ఉద్యోగం ఇస్తూ యాజమాన్యం ఉత్తర్వులు కూడా అందించింది. అయితే, ఉద్యోగంలో చేరే ముందు చేసిన మెడికల్ పరీక్షల్లో షానవి ఉద్యోగానికి రెజెక్ట్ అవ్వటం ఇదే మొదటిసారి కాదు. చాలాసార్లు ఉద్యోగానికి ఎంపికవ్వటం హిజ్రా అని తేలగానే రెజెక్టవ్వటం జరుగుతుందట. దాంతో షానవికి జీవితం మీదే విరక్తి పుట్టింది. చనిపోవాలని నిర్ణయించుకున్నది. అందుకే తమిళనాడు ముఖ్యమంత్రికి లేఖ రాసింది. కేంద్రంతో మాట్లాడి తనకు ఉద్యోగమన్నా ఇప్పించాలని లేకపోతే చనిపోయేందుకున్నా అనుమతి ఇవ్వాలంటూ లేఖలో షానవి వేడుకుంది. ఎప్పుడైతే సీఎంకు షానవి రాసిన లేఖ వెలుగు చూసిందో సోషల్ మీడియాలో సంచలనంగా మారింది. మరి తమిళనాడు సిఎం ఏం చేస్తారో చూడాలి. షానవికి మంచి భవిష్యత్ ఉండాలని రాజధాని వార్తలు ఆకాంక్షిస్తోంది.





# 'ఇంటర్'కూ మధ్యాహ్న భోజనం

**యనమల రామకృష్ణుడు**

**రాజధాని ప్రతినిధి, అమరావతి :** ఇంటర్మీడియెట్ విద్యార్థులకూ మధ్యాహ్న భోజనం పెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈమేరకు రానున్న బడ్జెట్ నిధులకు కసరత్తులు చేస్తోంది. బాలికా విద్యకు భరోసా కలిగించేలా, ఇప్పటి వరకూ 9వ తరగతి విద్యార్థినులకు బడికొస్తా.... మేరుతో సైకిళ్లు పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. వచ్చే విద్యా సంవత్సరం నుంచి 8వ తరగతి విద్యార్థినులకు సైకిళ్లు అందజేయాలని భావిస్తోంది. విద్యకు, యువతకు పెద్దపీట వేయనుంది. రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ఇప్పటికే ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది. డ్రాపౌట్స్ నిరోధంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే పదో తరగతి వరకూ మధ్యాహ్నం భోజన అమలు చేస్తోంది. పేద విద్యార్థులకు మరింత మేలు కలిగే విధంగా, ఉదయం టిఫిన్ (బ్రేక్ ఫాస్ట్) అందజేయాలనే ఆలోచన చేస్తోంది. అలాగే, నిరుద్యోగ భృతి ఇవ్వడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. దీనికి సంబంధించిన వివరాలు అందజేయాలని సంబంధిత శాఖాధికారులకు రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ఆదేశించారు. రాబోయే బడ్జెట్‌లో ప్రతిపాదనలపై హౌసింగ్, విద్యా, టూరిజం, యువజన శాఖాధికారులతో మధ్యాహ్నం సచివాలయంలోని తన కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాబోయే బడ్జెట్ యువతకు, విద్యకు, వ్యవసాయానికి అధిక ప్రాధాన్యతివ్వాలని అధికారులకు రాష్ట్ర ఆర్థిక మంత్రి దిశానిర్దేశం చేశారు. ఇందుకయ్యే వ్యయంపై లెక్కలు తేల్చాలని ఆర్థిక శాఖాధికారులకు ఆదేశించారు.

**8వ తరగతి విద్యార్థులకు సైకిళ్లు...**

బాలికా విద్యను ప్రోత్సాహించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం బడికొస్తా... పథకాన్ని అమలుచేస్తున్న విషయం తెలిసేందే. ఈ పథకం ప్రభుత్వ పాఠశాలల్లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థినులకు సైకిళ్లు అందజేస్తోంది. బాలికా విద్యాలో డ్రాపౌట్ల నిరోధానికి, మహిళా అక్షరాస్యత పెంపుదలకు 8వ తరగతి చదువుతున్న విద్యార్థినులకూ సైకిళ్లు అందజేయాలన్న రాష్ట్ర విద్యా శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు కోరికను మన్నిస్తూ, రాబోయే బడ్జెట్లో అవసరమైన నిధులు కేటాయించాలని యనమల రామకృష్ణుడు ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు.

# నోట్లకు కరవు

## బ్యాంకుల్లో తగ్గుతున్న జమలు




**హైదరాబాద్ :** పెద్దనోట్ల రద్దు నేపథ్యంలో చలామణిలోకి వచ్చిన రూ. రెండు వేల విలువైన నోట్లు రోజువారీ లావాదేవీల్లో భాగంగా బ్యాంకులకు దొరకడం గగనంగా మారింది. మూడు నెలలుగా ఈ నోట్లను జమచేసేవారి సంఖ్య సగానికి తగ్గిపోయింది. మరోవైపు బ్యాంకుల్లో మళ్లీ నగదు కొరత కనిపిస్తోంది. ఒక్క రోజు బ్యాంకులకు సెలవు వస్తే చాలు... ఏటీఎంలు పనిచేయడం మానేసు న్నాయి. బ్యాంకుల్లో నగదు నిల్వలపై నిఘాపెరిగిన తరువాత, ఎఫ్ఆర్‌డీఐ బిల్లు వచ్చాక బ్యాంకుల నుంచి నగదు ఉపసంహరణలు పెరుగుతున్నాయి. ఎక్కువమంది స్తిరాస్థి వ్యాపారాల్లో పెట్టుబడిగా పెడుతున్నారు. రూ. 2 వేల విలువైన నోట్లు బ్యాంకులకు రావడం లేదని, స్తిరాస్థి వ్యాపారంలోనే ఎక్కువగా ఉంటున్నాయని ఏపీ, తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల సంఘం కార్యదర్శి కుమార్ తెలిపారు. ఇటీవల కొన్ని జాతీయ బ్యాంకుల లావాదేవీలు పరిశీలించినపుడు రోజువారీ వచ్చే డిపాజిట్లలో గతంలో రూ. 10 లక్షల వరకు రూ.2 వేల విలువైన నోట్లుండేవి. ఇప్పుడు ఆ మొత్తం రూ. 4-5 లక్షలకు పడిపోయినట్లు సమాచారం. బ్యాంకులకు అవసరమైన నగదు సర్దుబాటు చేసే విషయంలో రిజర్వు బ్యాంకు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. బ్యాంకుల రోజువారీ కార్యకలాపాలకూ నగదు కొరత ఉంటోంది. హైదరాబాద్‌లోని కొన్ని ప్రధాన ప్రాంతాల్లోని బ్యాంకుల్లోనూ ఇలాంటి పరిస్థితి ఉంది. ఇక జిల్లా, మండల, గ్రామీణ ప్రాంతాల్లోని బ్యాంకుల్లో నేటికీ నగదు కొరత కనిపిస్తూనే ఉంది. కొన్ని బ్యాంకుల శాఖలో రోజువారీ ఉపసంహరణలు రూ.లక్షల మించి ఇవ్వడం లేదు.

# రుణ ఎగవేతల్ని ప్రకటించాల్సిందే

**పీఎన్‌బీ కుంభకోణం నేపథ్యంలో మళ్లీ తెరపైకి సెబీ ప్రతిపాదన**

**న్యూఢిల్లీ :** సంచలనం సృష్టించిన పీఎన్‌బీ కుంభకోణం.. స్టాక్ మార్కెట్ సంస్థల రుణాల వ్యవహారంపై మార్కెట్ రెగ్యు లేటర్ సెబీని మరోసారి దృష్టి పెట్టేలా చేస్తున్నది. ఈ స్కాంలతో అమాయక మదుపరులు ఎట్టిపరిస్థితుల్లోనూ నష్టపో కూడదనే ఉద్దేశంతో మార్కెట్ లిస్టింగ్ కంపెనీలు అన్ని రుణ ఎగవేతల వివరాలను ఒక్కరోజులో ప్రకటించాలనే ప్రతిపాదనను సెబీ గతంలోనే తీసుకొచ్చింది. అయితే మార్కెట్ లావాదేవీలను నష్టపరు స్తుందని, బ్యాంకింగ్‌తాజా కుంభకోణం నేపథ్యంలో సెబీ ప్రతిపాదనకు బలం చేకూరుతున్నది. దీంతో మళ్లీ తెరపైకి వస్తున్నది. ఏండ్ల తరబడి వెలుగుచూడని ఈ రూ. 11,400 కోట్ల భారీ స్కాం ప్రభావం ఇప్పటికే స్టాక్ మార్కెట్లపై పడుతున్నది. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌తోపాటు, గీతాంజలి జెమ్స్ షేర్ల విలువ అమాంతం పడిపోతున్న విషయం తెలిసిందే. ఈ కుంభకోణం సూత్రధారి నీరవ్ మోడీతో స్టాక్ మార్కెట్లకు ఎలాంటి ప్రత్యక్ష సంబంధాలు లేవు. అంటే ఈయన సంస్థలేవీ సాక్ మార్కెట్లలో లిస్టింగ్ కాలేదు. అయినప్పటికీ ఈయనవల్ల మోసపోయిన పీఎన్‌బీ.. స్టాక్ మార్కెట్ లిస్టింగ్ సంస్థ. అలాగే నీరవ్ మామ మెహుల్ చోక్సీ కూడా ఈ కుంభకోణంలో నిందితుడే కాగా ఆయన ప్రమోటర్‌గా వ్యవహరిస్తున్న గీతాంజలి జెమ్స్ కూడా స్టాక్ మార్కెట్ కంపెనీయే. దీంతో సహజంగా వీటి షేర్లు తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతుండగా, వీటిల్లో పెట్టుబడులు పెట్టిన మదుపరుల సంపద ఆవిరైపోతున్నది. ఇతర బ్యాంకుల షేర్లూ నష్టాల్లోకి జారుకున్నాయి. ఈ క్రమంలోనే గతంలో చేసిన ప్రతిపాదనను సెబీ తప్పక అమల్లోకి తెచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# బాధితులకు చేరువ కాని గ్రీవెన్స్

- ప్రకటనలకే పరిమితం
- అధికార, అనధికార కార్యకలాపాలకు నేలవు
- ఆడియాశలవుతున్న ఆశలు



**రాజధాని ప్రతినిధి, అమరావతి :** ముఖ్యమంత్రి చంద్రబాబుకి తమ బాధలు చెప్పుకుందామని వచ్చిన వారికి నిరాశ ఎదురవుతుంది. వందల కిలోమీటర్లు ప్రయాణం చేసి వచ్చిన బాధితుల ఆశలు ఆడియాసలుగా మిగలుతున్నాయి. ప్రజల సమస్యల పరిష్కరమే లక్ష్యంగా ఇటీవల ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసం పక్కన గ్రీవెన్స్ భవనం నిర్మాణం చేసి గృహ ప్రవేశం కూడా చేశారు. ఇంకే ముంది తమ కష్టాలు చెప్పుకునేందుకు సచివాలయం చుట్టూ తిరగనవసరం లేదని రాష్ట్ర ప్రజలు ఆనందపడ్డారు. ముఖ్యమంత్రిని ఇంటి దగ్గరే కలిసి తమ ఇబ్బందులు చెప్పు కోవచ్చని ఆశపడ్డారు. క్రమంగా సీఎం నివాసానికి బాధితుల తాకిడి పెరిగింది. అన్నదాతల నుంచి అనారోగ్యంతో బాధపడే వారి వరకు అదుకోమంటూ సీఎం నివాసానికి తరలిరావటం మొదలైంది. కాగా వచ్చిన వారిని సర్ది చెప్పి తిప్పి పంపించడం భద్రతా సిబ్బందికి తలనొప్పిగా మారింది. ఒక్కొక్కరు ఒక్కొక్క సమస్యతో వస్తు ఉండటంతో ఎవరిని ఏ విధంగా నొప్పించకుండా పంపించడం అనేది అతి పెద్ద ఇబ్బందిగా మారింది ఇదంతా ఒక ఎత్తైతే బాధలు చెప్పుకునేందుకు వస్తూనే పురుగు మందుల డబ్బా, కిరోసిన్ డబ్బాలు, ఇలా ఆత్మహత్యలు చేసుకునేందుకు రావటం వారిని నిరోధించటం కష్టతరంగా మారింది. ఇటీవల ఇబ్రహీంపట్నం నుంచి పలువురు బాధితులు నివాసాలు విషయంలో అన్యాయం చేశారంటూ మూకుమ్మడి ఆత్మహత్యలకు ప్రయత్నించారు. దీంతో ఆ రోజు రాష్ట్ర వ్యాప్తంగా ఈ విషయం సంచలనాత్మకంగా మారింది. అయితే భారీగా తరలివస్తున్న బాధితులను దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి ఇంటి దగ్గరే గ్రీవెన్స్ ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీనిపై ప్రతి సర్వత్రా హర్షం వ్యక్తం చేశారు.

**ప్రకటనకే పరిమితం...**

బాధితుల కోసం గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేస్తున్నామని చేసిన ప్రకటన అక్కడికే పరిమితమయ్యింది. గ్రీవెన్స్ హాల్ దాటి ముందు రాలేదు. అయితే సీఎం ఇంట గ్రీవెన్స్ భవనం ఏర్పాటు చేశారనే వార్త దావనంలా వ్యాపించడంతో విజయనగరం, శ్రీకాకుళంల నుంచి సైతం బాధితులు తమ ఇబ్బందులు తెలియ చేసుకునేందుకు ఉండవల్లిలో ముఖ్యమంత్రి ఇంటికి భారీగా రావటం మొదలుపెట్టారు. వచ్చిన ప్రతి ఒక్కరికి వెలగపూడి సచివాలయంకి వెళ్లండని చెప్పి వారిని ఏదో ఒక వాహనం ఎక్కించి సచివాలయం వైపు సాగనంపే ప్రయత్నం చేస్తున్నారు. అయితే సెలవు రోజుల్లో వచ్చిన బాధితులకు నచ్చజెప్పి పంపించడం భద్రతా సిబ్బందికి తలనొప్పిగా మారింది. గ్రీవెన్స్ ఉందని వచ్చాం మేము ముఖ్యమంత్రిని కలవాల్సిందేనని పట్టుబట్టి కదలని వారు ఎక్కువగా ఉంటున్నారు. బాధితుల కోసం గ్రీవెన్స్ ఏర్పాటు చేస్తారు కదా అని ప్రశ్నించే వారు అధికంగా ఉంటున్నారు. అయితే సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఎటు వెళ్ళాలో పాలుపోక నానా అవస్థలు పడుతున్నారు.

**సమావేశాలకే పరిమితం....**

గ్రీవెన్స్ పేరిట ఏర్పాటు చేసిన భవనం పూర్తిగా అధికారిక అనధికారిక కార్యక్రమాలకు వేదికగా మారింది. ప్రభుత్వ కార్యకలాపాలతో పాటుగా పార్టీ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు కేరాఫ్ గా గ్రీవెన్స్ బిల్డింగ్‌ను ఉపయోగించుకుంటున్నారు. కలెక్టర్ల సదస్సు మొదలుకొని కుప్పంలో చంద్రబాబు పే పోటీ చేసిన వ్యక్తిని పార్టీలోకి ఆహ్వానించే కార్యక్రమం వరకు అన్ని ఈ గ్రీవెన్స్ భవనంలోనే జరుగుతున్నాయి. చివరకు ముఖ్యమంత్రి ముఖ్య సమావేశాలు సైతం ఇక్కడనుంచే నిర్వహించటం చేస్తున్నారు. ఇంట్లో ఏ విధమైన సమావేశాలు నిర్వహించకుండా దాదాపు అన్ని గ్రీవెన్స్‌కి పరిమితం చేశారు. అయితే బాధితుల సమస్యలు వినేందుకు ఏర్పాటు చేసిన భవనంలో సమావేశాలు నిర్వహిచటం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా బాధితుల కోసం కొంత సమయం కేటాయించి గ్రీవెన్స్ భవనంలో బాధితుల గోడు వినాలని పలువరు బాధితులు వ్యాఖ్యానిస్తున్నారు. మరి సీఎం చంద్రబాబు ఏ విధంగా స్పందిస్తారో అనేది సర్వత్రా అసక్తికరంగా మారింది.

## కాలమ్

# పెళ్లంటే ...

మంచి వ్యక్తిని పెళ్లి చేసుకున్నారా?
ప్రతీరోజూ వాలంటైన్ డే !

ఒక దౌర్భాగ్య వ్యక్తిని పెళ్లి చేసుకున్నారా?
ప్రతీరోజూ "అమర వీరుల దినమే"!

ఒక బద్ధకపు సోమరిని పెళ్లి చేసుకున్నారా?
ప్రతి రోజూ "కార్మిక దినమే"

ఒక డబ్బున్న వ్యక్తిని పెళ్లి చేసుకున్నారా.
ప్రతీ రోజూ నూతన సంవత్సరం దినమే!

ఒక అమాయక వ్యక్తిని పెళ్లి చేసుకున్నారా?
ప్రతి రోజూ "బాలల దినమే"!

ఒక మోసగాడు/ మోసగతె ను పెళ్లి చేసుకున్నారా?
ప్రతీ రోజు "ఏప్రిల్ ఫూల్ డే"!

మీరు పెళ్లిచేసుకోలేదా?
ప్రతీరోజు "స్వాతంత్ర దినమే"??

# గుడ్డివాడు... హోటల్

మేనేజర్ మెను ముందుంచుతాడు..

నాకు కళ్ళు కనిపించవు మెను చదవలేను..

ఐటమ్స్ చెప్పమంటారా..? విని ఆర్డర్ చేయండి..

అక్కరేదులే కానీ... కిచెన్ లో నుండి స్పూన్ తీసుకుని రా... వాసన చూసి ఆర్డర్ చెప్తాను..

మేనేజర్ అతనివైపు ఎగా దిగా చూసి కిచెన్ లో నుంచి స్పూన్ తీసుకునివస్తాడు.. వాసన చూసి.. అబ్బా అల్లంతో చేసిన రవ్వదోస మంచి స్మెల్ వస్తుంది.. ఒకటి ఆర్డరివ్వు..!

ఆశ్చరం! నిజంగా నమ్మలేకున్నాను.. ఈ రోజు స్పెషల్ రవ్వదొశే సార్..! ఆశ్చర్యంతో...

ఇలా ప్రతి రోజు హోటల్‌కి వచ్చి వాసన చూసి కరెక్ట్‌గా ఆర్డర్ చేస్తున్నాడు..

రోజులాగానే గుడ్డివాడు హోటల్‌కి వచ్చి కిచెన్ లో నుంచి స్పూన్ తీసుకురమ్మన్నాడు

ఈ గుడ్డివాడు ఇలా ఎలా చెప్తున్నాడు..!? వీడిని ఒక ఆటపట్టించి చూద్దాం...(మేనేజర్ మనసులో...)

మేనేజర్ కిచెన్లోకి వెళ్ళి తన భార్య మరియాతో..

"ఈ స్పూన్ ని సుబ్రంగా నాకి నీ పెదాలతో తుడిచి ఇవ్వు....!"

మరియ అలాగే చేస్తుంది...

మనేజర్ గుడ్డివాడికి స్పూన్ ఇస్తాడు..

స్పూన్ వాసన చూసిన గుడ్డివాడు ఇలా అంటాడు.

OMG...!! నా క్లాస్ మేట్ మరియ కూడా ఇక్కడే పనిచేస్తుంది"

మేనేజర్......మూర్ఛపోయాడు..

హహహహహహహ ఫాలం...

# డిసెంబరు నాటికి ఉద్యోగుల ఇళ్లు సిద్ధం



**రాజధాని ప్రతినిధి, తుళ్ళూరు :** రాష్ట్ర రాజధానిలో ప్రభుత్వ భవనాల నిర్మాణం, రోడ్లు, డ్రైయిన్ల పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ అన్నారు. రాజధానిలో నిర్మాణాలను ఆయన పరిశీలించారు. రాజధానిలో మొత్తం 63 టవర్లలో 3,840 అపార్ట్‌మెంట్లను, గెజిటెడ్, క్లాస్ 4 ఉద్యోగుల కోసం నిర్మిస్తున్నామన్నారు. డిసెంబర్ 31వ తేదీ నాటికి పూర్తి చేయడంతోపాటు 2019 మార్చి కల్లా ఇక్కడ నివాసాలు ఉండేలా అందిస్తామన్నారు. ఇంతపెద్ద ఎత్తున పనులు జరుగుతున్నప్పటికీ కనీసం ఒక్క ఇటుకైనా పెట్టారా అని వైసీపీ నేతలు విమర్శించడం సరికాదన్నారు. రాజధానికొచ్చి ప్రతక్ష్యంగా పరిశీలించి వాస్తవాలు తెలుసుకోవాలని హితవుచెప్పారు. రాజధాని నిర్మాణానికి కనీసం రూ.48 వేల కోట్లు అవసరమవుతాయని, ఒక్క పరిపాలన నగరం నిర్మాణానికే రూ.11 వేల కోట్ల ఖర్చువుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు రూ.1,500 కోట్లు మాత్రమే ఇచ్చినందున మరింత సహాయం చేయాలని నారాయణ కోరారు.

# రెండో ర్యాంకరుగా నిలిచిన శైలజ

**కానూరు :** కృష్ణా జిల్లా విజయవాడ సమీప పోరంకి విష్ణుపురం కాలనీకి చెందిన డి. శైలజ(29సం) ప్రకటించిన గ్రూపు-1 ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచారు. ఆమె జనరల్ విభగంలో 15వ ర్యాంకు, మహిళల విభగంలో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించారు. 2011లో జరిగిన గ్రూపు-1 పరీక్షలకు ఆమె హాజరయ్యారు. ఆమె భర్త డాక్టర్ రాజేంద్ర.. ఐఆర్ఎస్ చేశారు. ఆయన ప్రస్తుతం విజయవాడ నగర డిప్యూటీ కమిషనర్(ఇన్‌కమ్‌ట్యాక్స్)గా పనిచేస్తున్నారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన శైలజ బీఎస్సీ జెనెటిక్స్ చేశారు. పట్టుదలతో చదివి విజయం సాధించానని ఆమె తెలిపారు.

# పెళ్లికళ వచ్చేసింది....



**రాజధాని ప్రతినిధి, అమరావతి :** పెళ్లి బాజాలకు వేళైంది. పెళ్లి మండపాలకు గిరాకీ పెరిగింది. మండపాలు దొరక్క పెళ్లింటి వారు నానా అవస్థలుపడుతున్నారు. చాలా వరకు మూడు నెలల క్రితమే అవి బుక్కయ్యాయి. మూఢం పేరుతో మూడు మాసాల పాటు పెళ్లి మండపాలు మూగబోయాయి ఇప్పుడు పెళ్లి బజాలు మోగించేందుకు నూతన వదూవరులు సిద్ధమవుతున్నారు మార్చి 3,4 తేదీలలో మంచి ముహుర్తాలు ఉండటంతో భారీగా జంటల ఒక్కటవనున్నాయి. ఈ నెలలోనూ అడపాదడపా వివాహాలు ఉన్నా.. వచ్చే నెల 3,4 తేదీలలో మాత్రం అత్యధికంగా ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా కళ్యాణ మండపాలు సిద్ధమవుతేన్నాయి. ఇప్పటికే దాదాపు అన్ని కళ్యాణ మండపాలు ఈ రెండు తేదీలలో బుక్ అయినట్లు తెలుస్తుంది. మూడు మాసాలుగా పెద్దగా వ్యాపారాలు లేక వెలవెల బోయిన బంగారు దుకాణాలతో పాటు బట్టల దుకాణాలు కిరాణా దుకాణాలు, పూలదుకాణాలు కిటకీలాడనున్నాయి. పూజారులకు ఉండే డిమాండు గురించి ప్రత్యేకంగా చెప్పనవరం లేదు. ఇప్పటికే వారికి బుక్ చేసుకునేందుకు పెళ్లి పెద్దల వారి ఇళ్ల చుట్టూ తిరుగుతున్నారు. ప్రస్తుత రుచులకు అనుగుణంగా క్యాటరింగ్ సంస్థలు కొత్త మెనూలను సిద్ధవ చేసుకుంటున్నాయి. వివాహాలు ఒకేసారి రావడంతో కళ్యాణ మండపాల ధరలను అమాంతంగా పెంచేశారు. హైదరాబాద్ పాటు వివిధ నగరాల్లో ప్రముఖ వస్త్ర వ్యాపారులు ప్రత్యేక డిస్కౌంట్‌ల పేరుతో కొనుగోలుదారులను ఆక్కట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

# తెలివి + తలపొగరు = ఆర్జీవీ



సినిమా


తెలివితేటలు పక్కదారి పడితే ఎలా తయారవుతారో నిలువెత్తు నిదర్శనం రామ్‌గోపాల్ వర్మ. 'శివ 'తో తెలుగు సినిమాల్లో నూతన ఒరవడిని సృష్టించిన ఆర్జీవీ అమితాబచ్చన్ వంటివాళ్లు (ఏసీబీ కార్పొరేషన్) సినిమాలు చేయడానికి బ్లాంక్ చెక్‌ను ఆఫర్ చేయగా, మరింత మంచి దర్శకుడుగా మారవలసిన సమయంలో నాయిష్ట వచ్చినట్లు సినిమాలు తీస్తాను మీకు ఇష్టమైతే చూడండి అంటూ పోస్టులు పెట్టాడు. నిజానికి వర్మ సమాజం మీద కాస్త బాధ్యతగా వ్యవహరిస్తే గౌరవప్రదమైన స్థానంలో ఉండే వాడంటానికి ఏమాత్రం సందేహం లేదు. రామలక్షణులు శూర్పణఖ ముక్కు చెవులు కోసారన్న దానిపై వారు తాలిబన్లలా చేశారన్నారు.

వినాయక చతుర్థిపై మాట్లాడుతూ తన తలనే రక్షించుకోలేని వినాయకుడు ప్రజల్ని ఏం కాపాడతాడని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దానిపై హిందూ సంఘాలు మండిపడ్డా, నాస్తికుడులే అని జనాలు సర్దిచెప్పుకున్నాడు. అయితే గాడ్-సెక్స్-ట్రూత్ (జీఎస్టీ) అనే పేరుతో పోర్న్ సినిమా తీసి తన పరువును పోగొట్టుకున్నాడు. అంతేకాదు వాటిపై మండిపడ్డ మహిళా సంఘాల నేతలపై అనుచిత వ్యాఖ్యలు చేసి ప్రస్తుతం పోలీసు విచారణను ఎదుర్కొంటున్నారు. హైదరాబాద్ లో పోలీసుల విచారణకు లాయర్‌తో సహా హాజరయ్యారు. అయితే ఆయన అరెస్టయ్యే అవకాశాలు లేకపోలేదని పోలీసు అధికారులు చెబుతున్నారు. విచారణానంతరం టీవీ9 ఇంటర్వ్యూలో బీజేపీ మహిళానేత ఒకరు ఆయనను ఎన్‌కౌంటర్ చేయాలన్న విధంగా మాట్లాడినందుకు కావాలనే తనపై అసత్యాలను ప్రచారం చేస్తున్నారని సదరు ఛానల్, యాంకర్ రజనీకాంత్, మహిళలపై క్రిమినల్ కేసులు వేస్తానని హెచ్చరించారు. పోర్న్ సినిమాలేమిటి అని అడిగిన పాపానికి వాటిని నిరసించే వారితోనే అలాంటి సినిమాలు తీస్తానని జుగుప్సాకరంగా మాట్లాడినప్పుడు తెలియలేదా వారి హక్కుల గురించి, తన వరకు వస్తేనే ఆయనకు చట్టం గురించి తెలిసిందా.. ఐద్వా నాయకురాలు మణి ,సామాజిక కార్యకర్త దేవి అందుకే పోలీసు స్టేషన్ మెట్లెక్కారన్నది రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు తెలిసిందే. ఇప్పటికే 10 ప్రశ్నలు వేసిన పోలీసులు మరింత సమాచారం కోసం శుక్రవారం మళ్లీ విచారిస్తున్నారు. ఇదేసమయంలో ఆర్జీవీని అరెస్టు చేయాలని బుధవారం నుంచి విశాఖపట్నం గాంధీ విగ్రహం వద్ద 48 గంటలపాటు మహిళా సంఘాలు నిరసన దీక్ష చేపట్టారు. జీఎస్టీ అనే పోర్న్ సినిమాకు ఓంకార నాదంతో సంగీతాన్ని సమకూర్చాడని సంగీత దర్శకుడు కీరవాణి పోలీసు విచారణ ఎదుర్కోవలసి వస్తోంది. త్వరలో సినిమా టీం మొత్తాన్ని విచారించేందుకు పోలీసులు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. కాగా మహిళాసంఘాల డిమాండు మేరకు ఏపీ ప్రభుత్వం గురువారం మూడు కేసులు నమోదు చేసింది.

## మోడీ హయాంలో

# స్వచ్ఛ బ్యాంకింగ్

స్వచ్ఛభారత్ మాటేమో గాని ప్రధాని మోడీ హయాంలో స్వచ్ఛ బ్యాంకింగ్ మాత్రం జరుగుతోంది. ప్రపంచంలోనే అత్యంత పటిష్టమైన భారత్ బ్యాకింగ్ వ్యవస్థ ఎన్‌డీఏ ప్రభుత్వ హయాంలో కుప్పకూలుతోంది. ప్రపంచం అంతటా ఆర్థిక మాంధ్యం, అమెరికాలో వాల్ స్ట్రీట్ (బ్యాంకుల) పతనం అయినా భారత్‌లో బ్యాంకింగ్ మాత్రం చెక్కుచెదరలేదు. అయితే మోడీ తీసుకున్న నోట్లరద్దు, జీఎస్టీలతో వంటి నిరంకుశ నిర్ణయాలతో బ్యాంకులు తమ ఉనికిని కోల్పోయే దారుణ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. ప్రస్తుతం ఏటీఎంలలో చాలా వరకు నో క్యాష్ బోర్డులతో ఉన్నాయి.



**ఎంతో అవసరం వచ్చి లక్ష రూపాయలు తీసుకుందామంటే డబ్బులు లేవండీ ఒక రూ.20 వేలు తీసుకెళ్లండి వంటి బ్యాంకు సిబ్బంది అభ్యర్థన వినిపిస్తోంది. అధికారం చేపట్టిన 100 రోజుల్లో ప్రతివారి ఎకౌంట్‌లో రూ. 15 లక్షలు వేస్తామన్న మోడీ చివరకు చేసింది ఇది...**

మూలిగే నక్కపై తాటి పండు పడినట్లు ఇప్పటికే 'ఐసీయూ'లో ఉన్న బ్యాంకులను కొల్లగొట్టేందుకు వ్యాపార , పారిశ్రామకి దిగ్గజాలన్నీ బ్యాంకుల ముందు క్యూలు కట్టాయి. ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వ్యాపార దిగ్గజం విజయ్‌మాల్యా రూ. 9 వేల కోట్ల రూపాయలు వివిధ బ్యాంకులకు ఎగనామం పెట్టి లండన్ చేరుకున్నారు. అంతకుముందు ఆయన రాజ్యసభ ఎంపీగా కూడా ఉన్నారు. అప్పుడే ఆయనపై అనేక బ్యాంకు కేసులు వచ్చాయి. బ్యాంకుల నుంచి అప్పుతీసుకున్న డబ్బునే ఆయా పార్టీ అధినేతలకు ఖర్చుపెట్టి ఎంపీగా ఎన్నికయ్యారని అప్పట్లోనే పత్రికలు ఘోషించాయి. ప్రజా ధనాన్ని అంతగా దుర్వినియోగం చేసినా పట్టించుకున్న నాధుడే లేడు. ఆనక ఆయన లండన్ చేరుకున్న తర్వాత లబోదిబో మన్నారు. ఈ నేపథ్యంలో దేశాన్ని విడిచిపెట్టే కొద్ది రోజుల ముందు బీజేపీకి అక్షరాలా రూ. 35 కోట్ల చెక్ ఇచ్చారని వార్తలు వచ్చాయి. అదే సమయంలో అది ఫేక్ చెక్ అని, దానిపై విజయమాల్యా సంతకం ఒరిజనల్ కాదని బ్యాంకుల చెబుతున్నాయి. 1.5 బిలియన్ డాలర్లతో మాల్యా లండన్ చెక్కేశారు. భారత్ కోరిక మేరకు అతని నగదును బ్రిటన్ స్తంభింప చేసి వారానికి 5 వేల పౌండ్లు మాత్రమే ఇస్తోంది. ఇది చాలదని లండన్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసుకొని వారానికి 20 వేల పౌండ్లు ఇవ్వాలని అభ్యర్థించగా, అతనిపై జాలిపడినకోర్టు వారానికి 18 వేల పౌండ్లు ఇచ్చేందుకు ఇటీవల ఆదేశాలు జారీచేసింది.

**లలిత్‌మోడీ :** భారత్ క్రికెట్‌ను నోట్లపై పరిగెత్తించిన ఘనత ఆయనకు సొంతం. ఐపీఎల్, 20-20 మ్యాచ్‌ల ఆవిష్కర్త.

2010లో కొచ్చి టీం విషయంలో ఆరోపణలు వచ్చాయి. ఫెమా ఉల్లఘనల నేపథ్యంలో దర్యాప్తు సంస్థ నోటీసులు జారీ చేసింది. దీంతో ఐపీఎల్ చైర్మన్ పదవి ఊడింది. అతను విదేశాలకు చెక్కేయడంలో విదేశీవ్యవహారాల శాఖ మంత్రి సుశ్మాస్వరాజ్, రాజస్థాన్ ముఖ్యమంత్రి వసుంధరారాజ్ సింధియాలు తోడ్పడ్డాయని పార్లమెంటులో గందరగోళం జరిగిన విషయం తెలిసిందే.

**సంజయ్ భండారీ :** ఆయుధాల వ్యాపారి అయిన సంజయ్ భండారీ రక్షణ కొనుగోళ్ల ఒప్పందాల్లో కీలక వ్యక్తిగా ఉన్నారు. రూ.150 కోట్లకు పన్ను ఎగవేతకు పాల్పడ్డారని ఢిల్లీ హైకోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో నేపాల్ మీదుగా విదేశాలకు చెక్కేశాడు.

**దీపక్ తల్వార్ :** కార్పొరేట్ కంపెనీలకు సలహాదారుగా ఉన్న దీపక్ యూపీఏ హయాంలో విమానయాన సంస్థకు ప్రయోజనాలు చేకూర్చేందుకు కీలక పాత్ర పోషించారు. ఆదాయపు శాఖ లెక్కలు అడగడంతో యూఏఈ పారిపోయాడు.ప్రస్తుతం భారత్‌ప్రభుత్వ చర్యల మూలంగా అక్కడినుంచి వేరే దేశాలకు వెళ్లే అవకాశాలు కోల్పోయాడు.

**నీరవ్ మోడీ :** ప్రస్తుతం ఈయన పేరే మీడియాలో మారు మోగుతోంది. రూ.11 వేలకోట్లతో విదేశాలు చెక్కేశాడు. బ్యాంక్ ఆఫ్ ఇండియా, యాక్సిస్ బ్యాంక్ అలహాబాద్ బ్యాంకులకు కలిపి మొత్త 14,400 కోట్ల బ్యాంకు రుణాల ఎగవేతదారుడు. ఏడు తరాల నుంచి ఇతని కుటుంబం వజ్రాల వ్యాపారంలో ఉంది. వజ్రాలకు నెలవైన బ్రెజిల్‌లోనే ఆయన పుట్టారు.వజ్రాల వ్యాపారంపై ఉన్న అభిమానంతో అమెరికాలో చదువు పూర్తి చేయకుండానే మేనమామ మెహుల్ చోక్సీవద్ద వ్యాపారాన్ని వంటబట్టించుకున్నాడు. ప్రస్తుతం చోక్సీకూడా బ్యాంకుడిఫాల్టర్‌గా విచారణ ఎదుర్కొంటున్నాడు. బయ్యర్ క్రెడిట్ పేరుతో వివిధ బ్యాంకుల నుంచి రుణం పొందాడు. దేశంలోనే రెండవ అతిపెద్ద బ్యాంకు పంజాబ్ నేషనల్ బ్యాంకు నుంచి రూ. 11,520 కోట్ల రూపాయలకు కుచ్చుటోపి పెట్టారు. జనవరిలోనే దేశంనుంచి జంప్ అయిన ఈయనకు సింగపూర్, హవాయి,బీజింగ్, హాంకాంగ్, బ్రిటన్, జపాన్, అమెరికా వంటి 16 దేశాల్లో లగ్జరీ డైమండ్ షోరూంలు ఉన్నాయి. 2015లో న్యూయార్క్‌లోని మ్యాడెన్ అవెన్యూలో ఆయన నెలకొల్పిన షోరూంను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రారంభించాడు. భారత్‌లో ఆయన్ను డైమండ్ కింగ్‌గా వ్యవహరిస్తారు.అత్యంత పిన్నవయస్కులోనే బిలయనీర్ అయిన వ్యక్తిగా అతన్ని ఫోర్బ్స్ పత్రిక ప్రశంసించింది. బంధువులు అనేక దేశాల పౌరసత్వంతో ఉండటం ఆయనకు బాగా కలసి వచ్చింది. ఫ్యాషన్ ఐకాన్‌గా గుర్తించబడిన నీరవ్ మోడీ వినియోగదారులుగా హాలివుడ్ నటి కేట్ విన్స్‌లెట్, స్పీల్ బర్గ్, బాలీవుడ్ నటి ఐశ్వర్యారాయ్ ఉన్నారు. తాజా వివాదాల నేపథ్యంలో బ్రాండ్ అంబాసిడర్ గా ఉన్న ప్రియాంక చోప్రా రెమ్యునరేషన్ ఇవ్వలేదని కోర్టు మెట్లెక్కింది. ఆయన లాయర్ అగర్వాల్ మాట్లాడుతూ ,బోఫోర్స్, 2జీ కుంభకోణాల్లాగే ఇదికూడా వీగిపోతుందనడం కొసమెరుపు. అయితే ఇప్పటి వరకు ఏ మంత్రీ, ఎంపీ,ఎమ్మెల్యేలు కూడా దేశానికి అన్నంపెట్టే రైతులకు సహాయం చేసిన దాఖలాలు లేవు. పంటలు పండక బ్యాంకు రుణాలు చెల్లించలేని రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే బడాబాబులు మాత్రం వేలకోట్లతో విదేశాలు ఉడాయిస్తున్నారని ఈ పరిస్థితికి కారణమైన రిజర్వుబ్యాంకు, విదేశీవ్యవహారాల శాఖ,న్యాయమంత్రిత్వశాఖ, పంజాబ్ నేషనల్ బ్యాంకు అధికారులను ప్రత్యర్థులుగా పేర్కొంటూ వినీత్ దత్తా సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజనాల వ్యాజ్యం దాఖలు చేశారు. సుప్రీంకోర్టు దీన్ని విచారణకు స్వీకరించింది.

– ఖాన్

**దేశంలో 9339 మంది కేటుగాళ్లు రూ. 1,11,738 కోట్లు ఎగనామం పెట్టారు. ఎన్డీయే అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో బ్యాంకుల్లో ఉద్దేశపూర్వక ఎగనామం 340 శాతానికి పెరిగింది. 2017 సెప్టెంబరు నాటికి 7,564 మంది డిఫాల్టర్లు రూ. 93,357 కోట్లు ఎగగొట్టారు.2013 యూపీఏ హయంలో బకాయిల విలువ 25,410 కోట్లు ఉండగా, ఇప్పడది 340 శాతానికి పెరిగింది. కేంద్రం సుప్రీంకోర్టు ఆదేశాలను కూడా బేఖాతరు చేస్తూ రూ.500 కోట్లు ఆపై ఎగవేతదారుల పేర్లను బహిర్గత పరచడానికి తిరస్కరించింది.**

బ్యాంకులో పెట్టుకుంటే, నీరవ్ మోడీ పట్టుకెళ్లిపోయాడు..!





క్రికెట్లో డబ్బు పెడితే, లలిత్ మోడీ పట్టుకెళ్లిపోయాడు..!

ఇంట్లో డబ్బు పెడితే, నరేంద్ర మోడీ పట్టుకెళ్లిపోయాడు..!



**మోడీలు ఎక్కడి నుంచి వచ్చార్రా బాబూ..! మేము డబ్బు ఎక్కడ పెట్టాల్రా నాయనో..!**

**ఇంతకీ విదేశాల నుంచి విజయ్‌మాల్యా, లలిత్ మోడీలను రప్పించడానికి ఇప్పటివరకు ఎంత ఖర్చు చేశారని సమాచార హక్కులో విదేశీ వ్యవహారాల శాఖను ప్రశ్నించగా ఆ లేఖను సదరు మంత్రిత్వశాఖ సీబీఐకి పంపింది. ఆ దర్యాప్తు సంస్థ దీనిపై స్పందిస్తూ మాకార్యకలాపాల వ్యయాలను వెల్లడించలేమని సమాచార హక్కు చట్టం సీబీఐకి వర్తించదని తేల్చిచెప్పింది. అంటే వారు బ్యాంకులను లూటీ చేసింది కాక, మళ్లీ వారిని వెనక్కు తెప్పించేందుకు మళ్లీ వేలకోట్లు ఖర్చు...ఇదంతా ప్రజాధనమేగా...**

# రాజధాని క్లాసిఫైడ్స్

## నివాస ప్లాట్లు

**నవులూరు**
రాజధాని ప్రాంతంలోని నవులూరు గ్రామ పరిధిలో 500, 1000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ :9440662699

**రాయపూడి**
రాజధాని ప్రాంతంలోని రాయపూడి గ్రామ పరిధిలో 500, 1000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9908244333

నీరుకొండ
రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్:9440662699

## రెంటల్స్

**రాయపూడి**
రాజధాని ప్రాంతం రాయపూడిలో 250 గజముల ఖాళీ స్థలము అద్దెకు కలదు
ఫోన్ : 9440662699

**రాయపూడి**
రాజధాని ప్రాంతం రాయపూడి గ్రామంలో కొత్తగా నిర్మించిన భవనం నందు 2 బెడ్‌రూమ్ అద్దెకు కలదు
ఫోన్ :9951915347

**విజయవాడ**
విజయవాడలో బస్‌స్టాప్‌కు దగ్గరలో, పార్కింగ్ వసతిగల 2 బెడ్‌రూమ్ ఇల్లు అద్దెకు కావలెను
ఫోన్ : 9440662699

**మల్కాపురం**
స్వాగత్ మెన్ ప్యూర్‌వెజ్
ఫోన్ : 90329 58580

## ఇతరములు

**తుళ్ళూరు**
ఎస్.ఎమ్(స్టైల్ ఫర్ మెన్) ట్రైలర్స్
ఫోన్ 9440307123

పి.యల్.సి.బి డెవలపర్స్
అమరావతి రాజధాని ప్రాంతంలో ఇళ్ల స్థలములు కావలసిన వారు సంప్రదించండి
ఫోన్ : 9676844442

**విజయవాడ**
విజయవాడలో బస్‌స్టాప్‌కు దగ్గరలో, పార్కింగ్ వసతిగల 1 బెడ్‌రూమ్ ఇల్లు అద్దెకు కావలెను
ఫోన్ : 9440662699

**మందడం**
ఎస్.ఆర్.కె. గ్రాండ్ రెస్టారెంట్
ఫోన్ : 9553023388

**వెలగపూడి**
సాయి గణేష్ ట్రెడర్స్: నిర్మాణ రంగానికిసిమెంట్, స్టీలు, పైపులు, పెయింట్‌లు అమ్మబడును.
ఫోన్ : 9640811333

**రాయపూడి**
చంద్రిక ట్రెడర్స్ నిర్మాణ రంగానికి సిమెంట్, స్టీలు,పైపులు అమ్మబడును.
ఫోన్ : 9908073516

**రాయపూడి**
రియల్‌ఎస్టేట్ క్రయ,విక్రయాలకు సంప్రదించడం న్యూసింగపూర్ రియల్ ఎస్టేట్
ఫోన్ : 9848442436

**రాయపూడి**
కాకతీయ ఫుడ్ కోర్ట్
ఫోన్ 9848021898

## వాణిజ్య ప్లాట్లు

**నవులూరు**
రాజధాని ప్రాంతంలోని నవులూరు గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9440662699

**ఐనవోలు**
రాజధాని ప్రాంతంలోని ఐనవోలు గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9908244333

నీరుకొండ
రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9440662699

## రెంటల్స్

**విజయవాడ**
విజయవాడలో బస్‌స్టాప్‌కు దగ్గరలో, పార్కింగ్ వసతిగల 2 బెడ్‌రూమ్ ఇల్లు ఆఫీసుకు కావలెను
ఫోన్ : 9440662699

**రాయపూడి**
రాజధాని ప్రాంతం రాయపూడిలో 250 గజముల ఖాళీ స్థలము అద్దెకు కలదు
ఫోన్ : 9440662699

**రాయపూడి**
రాజధాని ప్రాంతం రాయపూడి గ్రామంలో కొత్తగా నిర్మించిన భవనం నందు 1 బెడ్‌రూమ్ అద్దెకు కలదు
ఫోన్ :9951915347

**రాయపూడి**
రాజధాని ప్రాంతం రాయపూడి గ్రామంలో కొత్తగా నిర్మించిన భవనం నందు 2 బెడ్‌రూమ్ అద్దెకు కలదు
ఫోన్ :9951915347

## షాప్స్

**తుళ్ళూరు**
రేమాండ్స్‌ట్రైలర్స్
ఫోన్ : 9492470426

**రాయపూడి**
వర్షిత ఫోటోస్టాట్
ఫోన్ : 9985853188

**తుళ్ళూరు**
వైభవ్ డ్రస్సెస్
ఫోన్ : 9848407935

**తుళ్ళూరు**
రాజా గోల్డ్ కవరింగ్
ఫోన్ : 9581500500

**తుళ్ళూరు**
శ్రీసాయి జ్యూయలరీ వర్క్స్
ఫోన్ :9247171083

**రాయపూడి**
ఖాజా ఖాదర్ రైస్ స్టోర్స్
ఫోన్ : 9603990791

## హాస్పటల్స్

**విజయవాడ**
ఆంధ్ర హాస్పటల్, డా॥శ్రీమన్నారాయణ
ఫోన్ : 9177219900

**విజయవాడ**
ఇంధిరారావు మెడికేర్ (సెంటర్)
ఫోన్ : 9440421580

**విజయవాడ**
న్యూఫేస్ కీనిక్ , డా॥మేహబూబ్
ఫోన్ : 9849122788

**విజయవాడ**
అష్రఫ్ మెటర్నిటీ & ఇ,ఎన్‌టి డా॥ రెహమాన్
ఫోన్:0866-2475087

**విజయవాడ**
శ్రీమానస సైకియాట్రిక్ డా॥ అయోధ్య ఆర్.కె
ఫోన్:0866-2436647

గమనిక : క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో ఈ వార్తాపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

- మేనేజర్


# కరెన్సీ నారాయణ



వ్యక్తిపూజకు, హంగులూ ఆర్భాటాలకు కమ్యూనిస్టులు దూరంగా ఉంటారు. ఆలయాలకు వెళ్లే కమ్యూనిస్టుల సంఖ్య చాలా తక్కువే. కానీ కమ్యూనిస్టులందు కామ్రెడ్ నారాయణ వేరయా అన్నట్టుగా ఉంది. అప్పుడప్పుడు తిరుమల వెంకటేశ్వరస్వామి దర్శనానికి కూడా వెళ్తూ మిగిలిన కమ్యూనిస్టులను కంగారు పెడుతుంటారు నారాయణ. అది ఆయన వ్యక్తిగత విశ్వాసం అనుకోవచ్చు. కానీ ఏ కమ్యూనిస్టు లీడర్ చేయని తరహాలో ఆయన కరెన్సీ నోట్లతో గజమాల వేయించుకుని అందరినీ ఆశ్చర్యపరిచారు.సాధారణంగా పూలమాలలకు కూడా కమ్యూనిస్టులు దూరంగా ఉంటారు. నారాయణ మాత్రం చిత్తూరులో జరిగిన సీపీఐ జిల్లా మహాసభలో రూ. 200, 500 నోట్లతో అల్లిన గజమాలను వేయించుకున్నారు. ఆ సత్కారాన్ని నారాయణ ఏమాత్రం తిరస్కరించకుండా ఆనందంగా స్వీకరించారు. ఫొటోలకు ఫోజులు కూడా ఇచ్చారు. గతంలో యూపీలో మాయావతి ఒకసారి ఇలా కరెన్సీ దండ వేయించుకున్నందుకు గగ్గోలు పెట్టిన వారిలో కమ్యూనిస్టులు కూడా ఉన్నారు. బహుశా ఈ నారాయణ కూడా అప్పట్లో మాయావతిని విమర్శించే ఉంటారు. ఇప్పుడు మాత్రం కరెన్సీ మాలతో ఫోజులిచ్చారు. అవకాశం ఇస్తే కమ్యూనిస్ట్ పార్టీ అజెండాలోకి "ఇడ్లీలో చికెన్", "కమ్యూనిస్టుల ఆలయ దర్శనం", "కరెన్సీ గజమాల" వంటి కొత్త అధ్యాయాలను కూడా నారాయణ చేర్చేలా ఉన్నారు.

# గాంధీజీ హత్య వెనుక కుట్ర..?

## ఇందుకు సంబంధించి అమెరికా నుంచి తెచ్చిన ఆధారాలు సీల్డు కవరును సుప్రీం ముందుంచిన పిటిషనర్



**ఢిల్లీ :** "జాతిపిత మహాత్మాగాంధీ హత్య వెనుక పెద్ద కుట్రే జరిగింది. ఇందుకు సంబంధించి అమెరికా నుంచి నేను తెచ్చిన ఆధారాలను పరిశీలించండి" అని- గాంధీ హత్యపై పున:విచారణ కోరుతూ దాఖలైన కేసులో సుప్రీంకోర్టును పిటిషనర్ అభ్యర్థించారు. ముంబయికి చెందిన 'అభినవ్ భారత్' సంస్థ ధర్మకర్తృత్వ మండలి సభ్యుడు డా.పంకజ్ ఫడనీస్ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. జస్టిస్ ఎన్.ఎ.బాబ్డే, జస్టిస్ ఎల్. నాగేశ్వరరావుల ధర్మాసనం దీనిపై విచారణ చేపట్టింది. "అమెరికా నుంచి తిరిగివస్తూ అక్కడి లైబ్రరీ ఆఫ్ కాంగ్రెస్ నుంచి కొన్ని పత్రాలను తీసుకొచ్చాను. వీటిని బట్టి జాతిపిత హత్య వెనుక భారీ కుట్ర జరిగినట్లు అవగతమవుతోంది. అయితే కీలకమైన ఈ పత్రాలను భారత ప్రభుత్వం గతంలో నిషేధించింది. ఈ కేసులో న్యాయవైజ్ఞానిక ఆధారాలను పొందొవచ్చని అమెరికాకు చెందిన అటార్నీ ఒకరు సూచిస్తూరాసిన లేఖను కూడా చూడండి" అని ఫడనీస్ ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఆ లేఖను పరిశీలించిన ధర్మాసనం - ఇందులోని అంశాలు ఆసక్తికరంగా ఉన్నాయనీ, సాంకేతికత అభివృది చెందినందున ఫోరెన్సిక్ ఆధారాల సేకరణ సాధ్యమవుతుందని పేర్కొంది. కేసును పునర్విచారించే విషయాన్ని తర్వాత నిర్ణయిస్తామంది.పిటిషనర్ సీల్డు కవరులో ఆధారాలను సమర్పిస్తూ- వీటిని భారత ప్రభుత్వం గతంలో నిషేధించిందనీ, దానిని ఎత్తి వేయాలని కోరుతూ ముంబయి కోర్టును ఆశ్రయించి నట్లు పేర్కొన్నారు.


**ముస్లింలారా ఏకంకండి**
వక్ఫ్ ఆస్తులు రక్షించుకుందాం. వక్ఫ్ ఆస్తులపై మీ వద్ద ఉన్న సమాచారాన్ని మాతో షేర్ చేయండి. వెబ్‌సైట్‌లో పొందుపరచి అందరికీ అందుబాటులో ఉంచుదాం. 76809 94755
wakfsoldiers@gmail.com, wakfproperties.blogspot.com
హుస్సేన్ ఖాన్, అమరావతి

**ప్రకటనలకు సంప్రదించండి**
**9440662699**


Printed & Published by Shri Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor Shri Pattan Hussain Khan. RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2016-18, Cell 9440662699, Email : info@rajadhanivartalu.com